సాక్షి నంద్యాల

శనివారం ၊ 4 ၊ మే ၊ 2024



భ్రామరికి ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబాదేవికి దేవస్థాన అర్చకులు శుక్రవారం శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. ఊయలలో స్వామిఅమ్మవార్లను ఉంచి షోడశోపచార పూజలు చేపట్టారు.



మహానందీశ్వరుడికి పల్లకీ సేవ

మహానంది: మహానందీశ్వర స్వామి ఉత్సవ మూర్తులకు శుక్రవారం పల్లకీ సేవ నిర్వహించారు. అలంకరించిన పల్లకీలో కొలువైన స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేపట్టారు.



అలరించిన నృత్య ప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ నిత్యకళావేదికపై శుక్రవారం కర్ణాటక కై వారానికి చెందిన నాట్యాంజలి నృత్య అకాడమీ వారి సంప్రదాయ నృత్యప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.

న్యూస్‌రీల్

నిబంధనలు పాటించని ఆసుపత్రులపై చర్యలు

నంద్యాల టౌన్: ఫైర్ సేఫ్టీ, బయో వేస్ట్ మేనేజ్‌మెంట్ తదితర నిబంధనలు పాటించని ప్రైవేటు ఆసుపత్రులపై చర్యలు తప్పవని జిల్లా వైద్యారోగ్యాధికారి డాక్టర్ వెంకట రమణ హెచ్చరించారు. శుక్రవారం ఆయన నంద్యాల పట్టణంలోని పలు ప్రైవేట్ ఆసుపత్రులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు ఆసుపత్రి యాజమాన్యాలు ఎప్పటికప్పుడు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, శానిటేషన్ తదితర విభాగాలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు రెన్యువల్ చేయించాలన్నారు. అగ్ని ప్రమాద సమయాల్లో రోగుల పట్ల ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ఆసుపత్రి సిబ్బందికి అవగాహన ఉండాలన్నారు. ఎన్‌వోసీ లేకుండా, ఆరోగ్య శాఖ వద్ద నమోదు కాకుండా నడుపుతున్న ప్రైవేట్ ఆసుపత్రులను సీజ్ చేస్తామన్నారు. ఆయన వెంట డెమో ఆఫీసర్ రవీంద్ర నాయక్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

దేవస్థాన వైద్యశాలకు వైద్య పరికరాల అందజేత



దేవస్థానానికి వైద్యపరికరాలను అందజేస్తున్న దాత

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న దేవస్థాన వైద్యశాలకు పలు వైద్య పరికరాలను విరాళంగా అందజేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని హెచ్‌ఈఎస్ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఐ.వి.ఆర్.కృష్ణంరాజు దేవస్థాన వైద్యశాలకు వెంటిలేటర్–1, డిఫిబ్లేటర్–1, కార్డిక్ మానిటర్–1, బైపాస్ మిషన్–2, ఇన్ఫ్యూషన్ పంపులు–2 విరాళంగా అందజేశారు. ఆయా వైద్య పరికరాలను దేవస్థాన ఈఓ డి.పెద్దిరాజుకు అందజేశారు. వీటి విలువ సుమారు రూ.16 లక్షలకు పైగా ఉంటుందని దాతలు తెలిపారు. ఆయా పరికరాలను అత్యవసర చికిత్స నిమిత్తం గుండెకు సంబంధించిన పరీక్షలు చేయవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో వసతి విభాగం సహాయ కార్యనిర్వహణాధికారి ఐఎన్‌వీ మోహన్, పీఆర్వో టి.శ్రీనివాస రావు, పర్యవేక్షకులు అయ్యన్న, అపోలో డాక్టర్లు సాయికిషన్, డాక్టర్ శశిధర్, గుమస్తా నాగేంద్రం, దేవస్థాన వైద్యశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ బాహుబలులు



చందను ఎత్తుతున్న సుధాకర్

బేతంచెర్ల: పట్టణంలోని సయ్యద్ అల్లాబకాష్ వలీ ఉరుసును సందర్భంగా శుక్రవారం సాయంత్రం నిర్వహించి బల ప్రదర్శన పోటీలు ఆకట్టుకున్నాయి. 120 కేజీల గుండు, 130 కేజీల ఇసుక సంచి, 75 కేజీల చంద ఎత్తే పోటీల్లో యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలం పుల్లగుమ్మి సుధాకర్ చంద పందెంలో ప్రథమ స్థానం సాధించగా.. డోన్ మండలం గోసానిపల్లె చంద్ర ఇసుక, గుండు పందెంలో ప్రథమ స్థానంతో పాటు చంద పందెంలో ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నాడు. గోసానిపల్లె గ్రామానికి చెందిన మధు ఇసుక పందెంలో ద్వితీయ, వెల్దుర్తి మండలం మాధవవరం గ్రామానికి చెందిన రాజశేఖర్ గుండు పందెంలో ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నాడు. విజేతలకు నిర్వాహకులు వెండి పతకాలు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఖాజ, రాజ, ఇమామ్ హుసేన్, ఫైల్మాన్ పాల్గొన్నారు.

ములాఖత్ వేళలు మార్పు

కర్నూలు (లీగల్): వేసవి తీవ్రత దృష్టిలో ఉంచుకుని జైలు శాఖ డీజీ ఆదేశాల మేరకు కర్నూలులోని జిల్లా జైలులో ఖైదీలతో వారి బంధువులు మాట్లాడుకునేందుకు నిర్వహించే ములాఖత్ వేళల్లో మార్పు చేసినట్లు పర్యవేక్షణాధికారి ఘనే నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 3 నుంచి జూన్ 15వ తేదీ వరకు ఉదయం 8 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ములాఖత్ సమయాన్ని మార్చినట్లు పేర్కొన్నారు. ఖైదీల కుటుంబ సభ్యులు పైన తెలిపిన వేళలు పాటించాలని ఆయన కోరారు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు వాయిదా

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ విద్యార్థులకు నిర్వహించాల్సిన 2వ, 4వ సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేసినట్లు వర్సిటీ పరీక్షల విభాగం డీన్ ప్రొఫెసర్ వెంకట సుందరానంద పుచ్చ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 8వ తేదీ నుంచి ప్రారంభం కావాల్సిన డిగ్రీ 2, 4వ సెమిస్టర్ థియరీ పరీక్షలను వాయిదా వేసినట్లు పేర్కొన్నారు.



ఇంకెన్ని మెట్లు ఎక్కాలో..

పింఛన్ల పంపిణీకి పచ్చ బ్యాచ్.. వలంటీర్లను దూరం చేయడంతో లబ్ధిదారులు అవస్థలు అన్నీ ఇన్నీ కావు. ఠంచన్‌గా ఇంటి దగ్గర పింఛన్ అందుకున్న వారు రెండు నెలలుగా ఆపసోపాలు పడుతున్నారు. మే నెలకు సంబంధించి బ్యాంక్ అకౌంట్‌లో జమ చేయడంతో విత్‌డ్రా కోసం వృద్ధులు తప్పనిసరిగా బ్యాంక్‌కు వెళ్లాల్సి వస్తోంది. శ్రీశైలంలో ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఓ భవనంలోని రెండవ అంతస్తులో ఉన్నాయి. దీంతో వృద్ధులు మెట్లెక్కి వెళ్లలేక ఇబ్బందులు పడ్డారు. – శ్రీశైలం



ఆందోళన.. ఆవేదన

ప్రతి నెల 1వ తేదీ సూర్యుడు ఉదయించక ముందే వలంటీరు చిక్కటి చిరునవ్వుతో నిద్ర లేపి గుడ్ మార్నింగ్ చెప్పి పింఛన్ సొమ్ము అందుకునే లబ్ధిదారులు నేడు బ్యాంక్ మెట్లపై నిరీక్షించాల్సిన పరిస్థితి దాపురించింది. శుక్రవారం డోన్ యూనియన్ బ్యాంక్ వద్ద ఖాతాలో పడిన సొమ్మును తీసుకునేందుకు అధిక సంఖ్యలో వృద్ధులు గంటల తరబడి వేచివున్నారు. 'కష్టగట్టి ఇన్ని కష్టాలు పెట్టేందుకు తామేం పాపం చేశామని' ప్రశ్నిస్తున్నారు. సాఫీగా సాగుతున్న జీవితాలను ఇక్కట్లు పాలు చేసిన చంద్రబాబుకు తమ ఉసురు తప్పక తగులుతుందని శాపనార్థాలు పెడుతున్నారు. – డోన్ టౌన్

అర్జీ రాయండయ్యా..



ఇక్కడ కాగితాలు చేతపట్టుకుని దీనంగా కనిపిస్తున్న ఈమె పడకండ్ల గ్రామానికి చెందిన అచ్చమ్మగారి లక్ష్మమ్మ. పింఛన్ డబ్బు కోసం శుక్రవారం ఉదయం 9 గంటలకే బ్యాంకు దగ్గరకు వచ్చి కూర్చుంది. అధికారులు వచ్చి ఇంత తొందరగా ఎందుకు వచ్చావని అడిగితే 'పింఛన్ లెక్క కోసం వచ్చినా.. ఎండ పెడితే రాలేనని ముందే వచ్చిన నాయన' అని చెప్పడంతో వారు పరిశీలించి అకౌంట్ మనుగడలో లేదు అర్జీ పెట్టుకోమన్నారు. దీంతో బ్యాంకులో ఉన్న వారందరి దగ్గరకి వెళ్లి అయ్యా అకౌంట్ మళ్లీ ఓపెన్ చేయాలంటే ఎలా అని అందరినీ దీనంగా అడుగుతూ కనిపిస్తోంది. ఇలా ఎంతో మంది ఆందోళన చెందుతూ చాలా మంది కనిపించారు. – ఆళ్లగడ్డ

పింఛన్ కోసం 18 కి.మీ దూరం వచ్చి..



చిత్రంలో కనిపిస్తున్న వృద్ధురాలి పేరు సంతోషమ్మ వయస్సు 70 ఏళ్లు. మిడుతూరు మండలం జలకనూర్ గ్రామానికి చెందిన ఈమెకు వృద్ధాప్య పింఛన్ వస్తోంది. చంద్రబాబు కుతంత్రంతో ఇప్పుడు వలంటీర్లు పింఛను ఇచ్చే పరిస్థితి లేకపోవడంతో స్వగ్రామం నుంచి సుమారు 18 కిలో మీటరు దూరంలో ఉన్న నందికొట్కూరు పట్టణంలోని స్టేట్ బ్యాంక్ వచ్చి పింఛన్ తీసుకునే పరిస్థితి దాపురించింది. ఈనెల పింఛన్ కోసం మూడు రోజుల నుంచి బ్యాంక్ చుట్టు తిరుగుతున్నాం. 'మంచి చేసే వలంటీర్లను టీడీపీ నాయకులు దూరం చేయడం వల్లే మాకు ఈ కష్టాలు' అంటూ సంతోషమ్మ వాపోతుంది. – మిడుతూరు

పాపం అంకమ్మ!



ఈ వృద్ధురాలి పేరు బోయ అంకమ్మ. దేవరాయపురం గ్రామంలో నివసిస్తున్నారు. ఏప్రిల్ నెలలో చింతకుంట సచివాలయానికి వెళ్లి పింఛన్ తీసుకున్నారు. మే నెలకు సంబంధించి సచివాలయం దగ్గరకు వెళ్లే నీ అకౌంట్లో జమ అయిందని చెప్పారు. చింతకుంట బ్యాంకుకు పోతే అకౌంట్ పనిచేయడం లేదు ఆళ్లగడ్డ మెయిన్ బ్యాంకుకు పోయి చూసుకోమన్నారు. రూ 400కు ఆటో మాట్లాడుకుని భార్యాభర్తలు ఇద్దరు ఆళ్లగడ్డ బ్యాంకుకు వచ్చారు. ఇక్కడకు వచ్చి అడిగితే అకౌంట్ పనిచేయడం లేదు అర్జీ రాసి ఇచ్చి మళ్లీ రమ్మన్నారు. చేసేది లేక ఎండ పొద్దున నడవలేక భర్త చేయి పట్టుకుని నడుస్తున్న ఈమెను చూసిన వారు 'అయ్యో పాపం' అన్నారు. మా లాంటి వారికి ఇంటి వద్దే పింఛన్ అందకుండా చంద్రబాబుకు కుట్రలు చేయడం అన్యాయమని వాపోయారు. – ఆళ్లగడ్డ

పింఛన్ జమ కాక ఆందోళన



ఇక్కడ కొడుకుతో కలిసి ఆళ్లగడ్డ యూనియన్ బ్యాంక్‌కు వచ్చిన వృద్ధురాలు మొగల్ సోఖరబీ. ఆళ్లగడ్డ మండలం కోటకందుకూరు గ్రామంలో నివాసం. కొన్నేళ్లుగా వృద్ధాప్యంతో ఇంట్లో నుంచి బయటకు వచ్చేవారు కాదు. ప్రతి నెల వలంటీర్ ఇంటిదగ్గరే వచ్చి పింఛన్ సొమ్ము ఇస్తుండటంతో వాటితో అవసరమైన మందులు కొనుక్కుని వేసుకునేది. చంద్రబాబు అండ్ కో నిర్వాకంతో వలంటీర్ల ద్వారా పింఛన్ పంపిణీ నిలిపివేయడంతో పట్టణంలోని బ్యాంకు వద్దకు వచ్చారు. తీరా ఇక్కడకు వచ్చి డ్రా చేసుకునేందుకు ప్రయత్నించగా జీరో అకౌంట్ ఇందులో జమ కాలేదని అధికారులు చెప్పడంతో వృద్ధురాలు ఆందోళన చెందింది. – ఆళ్లగడ్డ

నారాకయాతన

- వలంటీర్ సేవల నిలిపివేతలో టీడీపీ అధినేతది కీలక పాత్ర
- చంద్రబాబుపై మండి పడుతున్న పింఛన్ లబ్ధిదారులు
- మండే ఎండల్లో మాకెందుకు ఇన్ని కష్టాలు అంటూ ఆవేదన
- ఉమ్మడి కర్నూలు జిల్లాలో డీబీటీ ద్వారా 3,53,405 మందికి నగదు బదిలీ
- సాంకేతిక కారణాలతో 5,917 మందికి బదిలీ కాని నగదు
- మూడో రోజూ బ్యాంకులకు పోటెత్తిన లబ్ధిదారులు
- పింఛన్ తీసుకొని ఇంటికి వెళ్తూ వృద్ధుడి మృతి

ముడతలు పడిన దేహం.. ఎముకల గూడు వంటి శరీరం.. సత్తువంతా కూడదీసుకున్నా నాలుగు అడుగులైనా వేయలేని దీనత్వం.. ప్రతి నెలా ఠంచన్‌గా వలంటీర్ ఇంటికి వచ్చి ఇచ్చే పింఛనే ఆధారం..అలాంటి ఆధారం నేడు సందిగ్ధంలో పడింది.. నెలంతా వాడాల్సిన మందులు.. ఇతర ఖర్చులు.. నెల 3వ తేదీ వచ్చినా అందని పింఛన్.. వృద్ధుల్లో ఒకటే ఆందోళన.. 48 డిగ్రీలకు పైగా నమోదవుతున్న ఎండల్లోనూ అడుగులో అడుగు వేసుకుంటూ..ప్రాణాన్ని అరచేతిలో పెట్టుకుని బ్యాంకుకు వెళితే అక్కడ వందల మంది..అంతా గందరగోళం.. గంటల తరబడి ఓపిగ్గా నిలుచుని కౌంటర్ దగ్గరికి చేరితే ఆధార్ అనుసంధానం కాలేదనో.. పాత బాకీ ఉందనో.. ఇలా ఎన్నో కారణాలతో పింఛన్ తీసుకోవడం కష్టమవుతోంది. ఇంట్లో హాయిగా పింఛన్ తీసుకునే తమకు కష్టాలు తెచ్చి పెట్టిన చంద్రబాబుపై అవ్వాతాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ ఉసురు తప్పక తగులుతుందని శాపనార్థాలు పెడుతున్నారు. టీడీపీ అధినేత కక్షపూరిత ధోరణిపై మండిపడుతున్నారు. ఎన్నికల్లో బుద్ధి చెబుతామని హెచ్చరిస్తున్నారు.



నందికొట్కూరు పట్టణంలోని స్టేట్ బ్యాంక్ వద్ద పింఛన్ కోసం వేచివున్న లబ్ధిదారులు

కర్నూలు(అగ్రికల్చర్)/నంద్యాల (న్యూటౌన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో పింఛన్ల పంపిణీ మూడో రోజుకు చేరుకుంది. కర్నూలు జిల్లాలో మొత్తం 1,88,104 మందికి గాను 1,55,254 మందికి, నంద్యాల జిల్లాలో 1,71,218 మందికి గాను 1,39,803 మందికి డీబీటీ ద్వారా గురువారం పింఛన్‌ను జమ చేశారు. రెండు జిల్లాలో మిగిలిన 64,265 మంది లబ్ధిదారుల్లో 58,348 మంది బ్యాంకు ఖాతాలకు శుక్రవారం నగదు జమ చేశారు. సాంకేతిక కారణాలతో 5,917 మందికి నగదు బదిలీ కాలేదు. మొత్తంగా ఉమ్మడి జిల్లాలో 3,53,405 మందికి డీబీటీ ద్వారా పింఛన్ సొమ్ము బ్యాంకు ఖాతాలకు జమ చేశారు. దీంతో పండుటాకులైన అవ్వాతాతలు, ఇతర పింఛన్‌దారులు మండటెండల్లో కష్టాలు ఎదుర్కొంటూ బ్యాంకులకు వెళ్లారు. లబ్ధిదారులకు పింఛన్ ఇవ్వకుండా కొన్ని బ్యాంకులు ఇబ్బందులకు గురి చేశాయి. పాత బకాయిలకు జమ చేసుకొని మొండి చేయి చూపాయి. పింఛన్ కోసం బ్యాంకుకు వచ్చి తిరిగి వెళుతూ ఒక వృద్ధుడు మృత్యువాత పడ్డాడు. నందవరం మండలం మాచాపురం గ్రామానికి చెందిన పులిచింత ఆనంద్ అనే వృద్ధుడు పింఛన్ తీసుకొని వెళ్తూ ఎండకు అస్వస్థతకు గుఐ ఇంటికి చేరకుండానే మృత్యువాత పడ్డారు. ఈ పాపం చంద్రబాబుదేనన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

చంద్రబాబు వల్లే ఈ కష్టాలు..

పింఛన్ లబ్ధిదారులతో బ్యాంకులు శుక్రవారం కిటకిటలాడాయి. చంద్రబాబు ముఠా కుట్రల కారణంగా ఏప్రిల్ నెలలో సచివాలయాలు, మే నెలలో బ్యాంకుల మెట్లు ఎక్కాల్సి వచ్చిందని అవ్వాతాతలు శాపనార్థాలు పెట్టడం చాలా చోట్ల కనిపించింది. 'మేం కష్టాలు పడటం వల్ల మీ కడుపు మంట చల్లారిందా' అంటూ పలువురు మండిపడ్డారు. వలంటీర్ సేవలను అడ్డుకున్న చంద్రబాబుకు తమ ఉసురు తగులుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా.. కర్నూలు జిల్లాలో 3,339 మందికి, నంద్యాల జిల్లాలో 2,578 మందికి మొత్తంగా 5,917 మందికి వివిధ కారణాలతో నగదు బదిలీ కాలేదు. వీరికి శనివారం ఇంటికి వెళ్లి పింఛన్లు అందజేయనున్నారు.



పింఛన్ సొమ్ముకోసం ఉదయం నుంచి జూపాడుబంగ్లా ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు వద్ద పడిగాపులు కాస్తున్న అవ్వా,తాతలు



నంద్యాల నూనెపల్లెలోని యూనియన్ బ్యాంక్‌లో పింఛన్ కోసం వృద్ధులు పడుతున్న పాట్లు



ఆళ్లగడ్డ యూనియన్ బ్యాంక్‌లో మనుగడలో లేని ఖాతాలను పునరుద్ధరించాలని ఈకేవైసీ ఇస్తున్న పింఛన్‌దారులు

అకౌంట్ హోల్డ్ అయ్యిందట



ఒకటవ తేదీ పింఛన్ కోసం సచివాలయానికి వెళ్లా. అక్కడ బ్యాంక్ అకౌంట్‌లో పడుతుందని చెప్పారు. రెండవ తేదీ బ్యాంక్ వద్దకు వెళ్తే జనాలు ఎక్కువగా ఉండటంతో ఇంటికి తిరిగి వచ్చా. ఈరోజు బ్యాంక్‌కు పోతే నా ఖాతా హోల్డ్‌లో ఉందని చెప్పారు. అప్లికేషన్ ఇచ్చి పూర్తి చేసుకుని రేపు రమన్నారు. నా గోడు ఎవరికీ చెప్పుకోవాలో తెలియని పరిస్థితి. ప్రశాంతంగా ఇంటి వద్దకు వలంటీర్లు వచ్చి పింఛన్ ఇస్తే ఆ సొమ్ము మందులకు, ఇతరత్రా ఇంటి అవసరాలకు ఉపయోగపడేది. ఈ ఎండలకు పింఛన్ కోసం తిరిగితే ఏదైనా జరిగితే ఎలా. టీడీపీ వాళ్లు వలంటీర్లను అడ్డుకోవడం దారుణం.

– జయమ్మ, ఏకలవ్యనగర్, నంద్యాల

చంద్రబాబుకు మానవత్వం లేదు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మా పెద్ద బిడ్డ లాగా పింఛన్లను వలంటీర్ల ద్వారా ఇంటికి పంపిస్తే నేడు ఎన్నికల్లో రాజకీయ లబ్ధి కోసం చంద్రబాబు అడ్డుకోవడం కరెక్ట్ కాదు. బాబుకు మానవత్వం లేదు. ముసలోళ్లకు కష్టాలు తెచ్చిన ఆయనకు ఎన్నికల్లో బుద్ధి చెబుతారు. ఎండలో వచ్చి గంటల తరబడి క్యూలో నిలబడి ఇప్పుడు పింఛన్ తీసుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. బ్యాంక్‌లో రసీదులు ఎలా రాయాలో తెలియదు. దాని కోసం మళ్లీ ఎవరినైనా అడగాలి. – పక్కీరమ్మ, బొగ్గులైన్, నంద్యాల

ఆయాసపడుతూనే వచ్చాను



పింఛన్ డబ్బులతో డాక్టర్ వద్ద చూపించుకొంటూ నెల నెలా మందులు వాడుతున్నాను. నెల నెలా ఇంటివద్దకు వలంటీర్లు వచ్చి పింఛన్ డబ్బులు చేతిలో పెట్టేవారు. చంద్రబాబు చేసిన పనికిమాలిన పనికి పోయిన నెల సచివాలయం వద్ద పింఛన్ ఇవ్వగా ఈనెల బ్యాంకులో పింఛన్ డబ్బులు వేశామంటున్నారు. పింఛన్ డబ్బుల కోసం ఆయాసపడుతూనే బ్యాంకు వద్దకు వచ్చాను. సారొళ్లు 10.30 గంటలకు వస్తామన్నారు. ఎండలు ఎక్కువగా ఉండటంతో పాటు ఆయాసంగా ఉన్నందున ఇబ్బంది పడ్తున్నాను. నాలాంటి ముసలివాళ్లను కష్టపెడ్తే చంద్రబాబుకు తగిన శాస్తి జరుగుతుంది.

– బ్రహ్మయ్య, జూపాడుబంగ్లా

నిప్పులు కక్కుతున్న సూరీడు

- నంద్యాల జిల్లాలో 47.7 డిగ్రీల ఉష్ణోగ్రత



మండలం	ఉష్ణోగ్రత
పాణ్యం	46.9
కర్నూలు	45.9
కల్లూరు	46.8
కోడుమూరు	45.7
దొర్నిపాడు	46.6
గడివేముల	46.3
మిడుతూరు	46.3
ఆళ్లగడ్డ	46.2
రుద్రవరం	46.2
మహానంది	46.2
శ్రీశైలం	46.1

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాల్లో వడగాడ్పుల తీవ్రత మరింత అధికమైంది. గత ఏడాది వరకు ఉష్ణోగ్రతలు గరిష్టంగా 46 డిగ్రీల వరకే ఉన్నాయి. మొదటిసారి నంద్యాల జిల్లాలోని మూడు మండలాల్లో దాదాపు 48 డిగ్రీలకు చేరువ కావడం గమనార్హం. బండిఆత్మకూరు, గోస్పాడులో 47.7 డిగ్రీలు.. నందికొట్కూరులో 47.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. నంద్యాల జిల్లాలో ఏకంగా 25 మండలాల్లో.. కర్నూలు జిల్లాలోని 5 మండలాల్లో హీట్ వేవ్ నమోదైంది. గతంలో ఎప్పుడూ లేని విధంగా కర్నూలు నగరంలో రికార్డుస్థాయి ఉష్ణోగ్రత నమోదైంది. ఎండలు, వడగాడ్పుల తీవ్రత గరిష్ట స్థాయికి చేరుతుండటంతో మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల వరకు రహదారులపై వాహనాల రాకపోకలు తగ్గిపోతున్నాయి. పాదచారులకు చలివేంద్రాలు కాస్త ఊరటనిస్తున్నాయి. గత ఏడాది ఉదయం ఎండలు ఉన్నా.. సాయంత్రానికి వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడం వల్ల అకాల వర్షాలు, చల్లటి గాలులు వీచినా.. ఇప్పుడు ఆ పరిస్థితి లేకపోవడం గమనార్హం.

చంద్రబాబు ఒక్క మంచి పని చేయలేదు

- మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి



డోన్ కొండపేట జెండా కట్ట వీధిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి బుగ్గన

డోన్: 40 ఏళ్ల రాజకీయ జీవితం.. 14 ఏళ్లు రాష్ట్రాన్ని పాలించిన అనుభవం అని గొప్పలు చెప్పుకుంటున్న మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రజలకు గుర్తుండిపోయే మంచిపని ఒక్కటైనా చేశారా అని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రశ్నించారు. నియోజకవర్గ కేంద్రం డోన్ 8 నుండి 11వ వార్డులలో శుక్రవారం రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ చిన్నకేశవయ్యగౌడ్, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్‌ల ఆధ్వర్యంలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చంద్రబాబు కంటే వయసులో అతి చిన్నవాడు, అనుభవం తక్కువవున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సామాన్య, పేద, మధ్యతరగతి ప్రజలకు జీవన ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచేందుకు శాశ్వతంగా గుర్తుండిపోయే అనేక పథకాలను అమలు చేస్తున్నారన్నారు.

సూపర్ సిక్స్.. అమలు అసాధ్యం

చంద్రబాబు అధికార దాహంతో అమలు చేయలేని సూపర్ సిక్స్ హామీలతో ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తుండటం శోచనీయమని మంత్రి విమర్శించారు. అధికారం కోసం సూపర్‌సిక్స్ పేరుతో ప్రజలను అబద్ధాలతో మోసం చేయాలని చూస్తున్నారన్నారు. ఈ విషయాన్ని ప్రజలందరూ పసిగట్టి తగిన బుద్ధి చెప్పాలని ఆయన కోరారు.

కరోనా సమయంలో ఎక్కడున్నారు..

50 ఏళ్ల నుంచి డోన్ నియోజకవర్గ ప్రజలకు ఎన్నో సేవలు చేశామని గొప్పలు చెప్పుకుంటున్న కోట్ల, కేఈ కుటుంబాలు కరోనా వైరస్ మూలంగా ప్రజల ప్రాణాలు గాలిలో కలిసిపోతుంటే ఎక్కడ దాక్కున్నారని మంత్రి బుగ్గన నిలదీశారు. 14 ఏళ్ల పాటు స్థానికుల మొహం చూడని కోట్ల కుటుంబం కూడా డోన్ ప్రజలు మావాళ్లు అనడం సిగ్గుచేటన్నారు. ప్రశాంతంగా ఉన్న డోన్ నియోజకవర్గంలో తిరిగి కక్షల కుంపటిని రాజేసి ప్రజలను ఫ్యాక్షన్ ఊబిలోకి నెట్టేసేందుకు కోట్ల, కేఈ కుటుంబాలు కుట్ర పన్నుతున్నాయని మంత్రి బుగ్గన ప్రజలను హెచ్చరించారు. ఓటుతో మీ భవిష్యత్తును బంగారు బాటగా మార్చుకునేందుకు వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి అభ్యర్థులను గెలిపించాలని ఆయన ఈ సందర్భంగా ఓటర్లను కోరారు. బుగ్గన వెంట కౌన్సిలర్లు మౌలాబీ, ఫాతిమాబీ, టమటం లక్ష్మి, దినేష్‌గౌడ్, సుకన్య పాల్గొన్నారు.


శిరివెళ్ల: జనసందోహం మధ్య వనికినిదిన్నెలో ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి రోడ్డుషో


డోన్: పట్టణంలో ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డికి హారతులు ఇస్తున్న మహిళలు


గడివేముల: ప్రజలకు అభివాదం చేస్తున్న పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి


బొమ్మలసత్రం: నంద్యాల 28వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి



సి.బెళగల్: పోలకల్ గ్రామం లో ఫ్యాన్ గుర్తును చూపుతున్న కర్నూలు ఎంపీ అభ్యర్థి బీవై రామయ్య, ప్రచారానికి పోటెత్తిన జనం



వెలుగోడు: రేగడగూ దూరులో మాట్లాడు తున్న శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్ర పాణిరెడ్డి, రోడ్‌షోలో పాల్గొన్న గ్రామస్తులు



కొలిమిగుండ్ల: అంకిరెడ్డి పల్లెలో ఇంటిం టి ప్రచారం నిర్వహిస్తున్న బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, ప్రచారం లో జన హోరు


ఎమ్మిగనూరురూరల్: ప్రభుత్వం అమలు చేసిన నవరాత్నాలను గుర్తు చేసే విధంగా చీరలు ధరించి న్యూ బనవాసి ఎస్సీ కాలనీలో ప్రచారం చేస్తున్న మహిళలు

ఊరూరా నీరాజనం

ప్రచార పర్వం

సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు ఓటర్లు నీరాజనం పలుకుతున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం గ్రామాలకు చేరుకున్న నాయకులకు బ్రహ్మరథం పడుతున్నారు. రోడ్‌షోలో యువతతో పాటు వృద్ధులు సైతం పాల్గొని మేమంతా సిద్ధమంటూ మద్దతు తెలుపుతున్నారు. సంక్షేమం, అభివృద్ధిని అందించిన జగనన్నే మళ్లీ సీఎం అంటూ చెబుతున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



మంత్రాలయం: కల్లుదేవకుం టలో ప్రసంగిస్తున్న మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, చిలకలదోణ ప్రచారంలో పాల్గొన్న జనం



పాములపాడు: మద్దూరు గ్రామంలో మాట్లాడు తున్న నందికొట్కూరు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ధారా సుధీర్, పాముల పాడు రోడ్‌షోలో పాల్గొన్న ప్రజలు


ఎమ్మిగనూరు రూరల్: కె.తిమ్మాపురం గ్రామంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుకతో కరచాలనం చేసేందుకు ఎగబడుతున్న మహిళలు


వెల్దుర్తి: కలుగొట్లలో ఎమ్మెల్యే అభ్యర్థి కంగాటి శ్రీదేవి రోడ్‌షోకు హాజరైన జనం


కర్నూలు: బుధవారపేటలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ కర్నూలు ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్


ఆస్పరి: చిగేలిలో గిరకబండి పోటీలను ప్రారంభిస్తున్న ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థి బుసినె విరూపాక్షి

దొరపల్లెలో పోలీసు కవాతు



డోన్ టౌన్: ప్రజలు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవడానికి భరోసా కల్పిస్తూ పోలీసులు దొరపల్లె గ్రామంలో కవాతు నిర్వహించారు. ట్రెనింగ్ డీఎస్పీ రఘువీర్, పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో అర్మడ్ రిజర్వ్ పోలీసుల బలగాలతో కవాతు నిర్వహించి ప్రజల్లో మనో ధైర్యం నింపారు. అనంతరం గ్రామస్తులకు ఎన్నికలపై అవగాహన కల్పించారు.

మద్యం మత్తులో కింద పడి వ్యక్తి మృతి

ఓర్వకల్లు: మద్యం మత్తులో ఓ వ్యక్తి కింద పడి మృతి చెందిన సంఘటన గుట్టపాడు గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన వడ్డే గుంజల దర్గయ్య(47), శేషమ్మ దంపతులు స్థానిక స్టీల్ ప్లాంట్‌లో కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. వీరికి నాగశేషులు అనే ఒక్కగానొక్క కొడుకు సంతానం. అయితే తాగుడు బానిసైన దర్గయ్య గత నెల రోజుల నుంచి పనులకు వెళ్లకుండా నిత్యం మద్యసేవించి కుటుంబ సభ్యులతో గొడవపడేవాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి కూడా మద్యం సేవించి ఇంటికి వెళ్లాడు. రాత్రి 10 గంటల సమయంలో కుటుంబ సభ్యులు ఇంటిముందు భోజనం చేస్తుండగా భార్య శేషమ్మతో గొడవకు దిగాడు. అక్కడే ఉన్న కొడుకు నాగశేషులు తండ్రిని వారించాడు. అయినా వినిపించుకోలేని దర్గయ్య తాగిన మైకంలో ఇంటి మెట్లు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడ్డాడు. దీంతో తలకు తీవ్ర రక్త గాయం కావడంతో కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లాడు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుని భార్య శేషమ్మ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్ఐ రాజారెడ్డి తెలిపారు.

నిలకడగా ఎండుమిర్చి ధరలు

నంద్యాల(సెంట్రల్): పట్టణంలోని మిర్చి యార్డులో శుక్రవారం సూపర్-10 సరకు రకం జనరల్ క్వింటాలు గరిష్ట ధర రూ.13,000, మధ్యస్థ ధర రూ.10,000, కనిష్ట ధర రూ.8,000గా నమోదైంది. ఇదే రకం తాలుకాయ జనరల్ గరిష్ట ధర క్వింటాలు రూ.6,000, మధ్యస్థ ధర రూ.5,000, కనిష్ట ధర రూ.4,500గా పలికినట్లు యార్డు ఎంపిక శ్రేణి కార్యదర్శి కల్పన తెలిపారు.

తెలంగాణ మద్యం స్వాధీనం

పగిడ్యాల: పగిడ్యాల గ్రామానికి చెందిన సాయి అలియాస్ చాకలి సాయి అనే వ్యక్తి తెలంగాణ రాష్ట్రం నుంచి బైక్‌లో 192 మద్య సీసాలను తరలిస్తుండగా నెహ్రూనగర్ క్రాస్ రోడ్డు వద్ద రైడ్ చేసి పట్టుకున్నామని ఎస్ఐ జయశేఖర్ శుక్రవారం తెలిపారు. నిందితుడిపై ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

ఇంజినీరింగ్ విద్యార్థులకు మంచి ప్లేస్‌మెంట్స్

- ఆర్‌యూ వీసీ ప్రొఫెసర్ బి.సుధీర్ ప్రేమ్ కుమార్


ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకులతో సమీక్ష నిర్వహిస్తున్న వీసీ సుధీర్ ప్రేమ్ కుమార్

కర్నూలు కల్చరల్: ఇంజినీరింగ్ విద్యార్థులకు మంచి ప్లేస్‌మెంట్స్ చూపించాలని రాయలసీమ విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ బి.సుధీర్ ప్రేమ్ కుమార్ అధ్యాపకులను ఆదేశించారు. శుక్రవారం వీసీ తన చాంబర్‌లో వర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ ఎన్.టి.కె.నాయక్‌తో కలిసి , ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకులతో సమీక్ష నిర్వహించారు. లెసన్ ప్లాన్‌తో పాటు అవసరమైన రికార్డులను అధ్యాపకులు తప్పనిసరిగా తయారు చేసుకోవాలన్నారు. వేసవి సెలవుల అనంతరం బయోమెట్రిక్ ద్వారా విద్యార్థుల హాజరును పర్యవేక్షిస్తామన్నారు. విద్యార్థుల స్థాయిని అనుసరించి అవసరమైన వారికి అదనపు తరగతులను నిర్వహించాలన్నారు. సైబర్ సెక్యూరిటీ అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. అధ్యాపకుల నైపుణ్యాల మెరుగుదలకు శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలోఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై. హరిప్రసాద్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

స్నాతకోత్సవం నిర్వహణకు ఏర్పాట్లు చేయండి

రాయలసీమ విశ్వవిద్యాలయ 4వ స్నాతకోత్సవం (కాన్వకేషన్) జూన్ 21వ తేదీన నిర్వహించడానికి ఏర్పాట్లు చేయాల్సిందిగా విశ్వ విద్యాలయ వీసీ సుధీర్ ప్రేమ్ కుమార్ వర్సిటీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం వీసీ ఛాంబర్‌లో కాన్వకేషన్ నిర్వహణపై వర్సిటీలోని వివిధ విభాగాల ఆచార్యులు, అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. స్నాతకోత్సవ నిర్వహణకు వివిధ కమిటీలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వర్సిటీ రెక్టార్ ఆచార్య ఎన్‌టీకే నాయక్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్.అంకన్న, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సి.వి.కృష్ణారెడ్డి, రీసెర్చ్ డైరెక్టర్ ఆచార్య సి.విశ్వనాథరెడ్డి, అకడమిక్ అఫైర్స్ డీన్ ఆచార్య ఆర్.భరత్‌కుమార్, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై. హరిప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలనపై విస్తృతంగా ప్రచారం చేయండి


మాట్లాడుతున్న జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై విస్తృతంగా ప్రచారం చేయాలని, అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి వైఎస్సార్‌సీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శుక్రవారం కొలిమిగుండ్లలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ మండల ఇన్‌చార్జ్ కాటసాని ప్రసాదరెడ్డితో కలిసి యువతీ, యువకులు, పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత పార్టీ కోసం కష్ట పడి పని చేసి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని సీఎంగా చేసేందుకు కృషి చేయాలని కోరారు. దశాబ్దాలుగా పేరుకుపోయిన సమస్యలను తీర్చిన ఘనత ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికే దక్కుతుందన్నారు. నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దిన కాటసానిని గెలిపించుకునే బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి పేరం సత్యనారాయణరెడ్డి, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు లాయర్ మహేశ్వరరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ మొలక రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పద్మశాలి విద్యార్థులకు నగదు బహుమతులు

కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని పద్మశాలి విద్యార్థులను ప్రోత్సహించేందుకు పద్మశాలి సంఘం కర్నూలు జిల్లా ఆధ్వర్యంలో నగదు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందిస్తున్నట్లు అధ్యక్షులు భీమనపల్లె వెంకటసుబ్బయ్య శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 10వ తరగతిలో 540 మార్కులకు పైగా, ఇంటర్మీడియెట్‌లో 900 మార్కులకు పైగా సాధించిన విద్యార్థులకు మెరిట్ ఆధారంగా ఈనెల 26న నంద్యాలలోని శ్రీ భద్రావతి భావనారుషి ఆలయ కల్యాణ మండపంలో ప్రతిభా పురస్కారాలను అందించనున్నట్లు తెలిపారు. మొదటి బహుమతి రూ.10 వేలు, ద్వితీయ బహుమతి రూ.7,500, తృతీయ బహుమతి రూ.5 వేలు, కన్సోలేషన్ బహుమతులు రూ.2 వేలు, ప్రశంసా పత్రాలు, మెమెంటోలను అందించేందుకు కమిటీ తీర్మానించిందన్నారు. అర్హులైన విద్యార్థులు ఈ నెల 15వ తేదీలోగా తమ మార్కుల జాబితా, కులధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలను పంపాలన్నారు. పూర్తి వివరాలకు 9908541124, 9908386822, 9701232676 సంప్రదించాలన్నారు.

కొలనుభారతి సేవలో నంద్యాల జడ్జి



కొలనుభారతి సన్నిధిలో జడ్జి ఆదినారాయణ

కొత్తపల్లి: సరస్వతి క్షేత్రంగా వీరాజిల్లుతున్న కొలను భారతిదేవి అమ్మవారిని నంద్యాల జూనియర్ సివిల్ జడ్జి, ఆత్మకూరు ఇన్‌చార్జ్ జడ్జి వి.ఆదినారాయణ శుక్రవారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. అమ్మవారికి కుంకుమార్చన, పుష్పార్చన, మంగళహారతి పూజలు చేశారు. అమ్మవారి చిత్రపటం అందజేశారు. అనంతరం జడ్జి సప్తశివాలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అక్కడే ఉన్న చారఘోషిని నదిని పరిశీలించారు.

కూలీల వాహనం బోల్తా.. ఒకరు మృతి

కర్నూలు: కూలీలతో కర్నూలు వెళ్తున్న టాటా ఏస్ వాహనం బోల్తా పడి సి.బెళగల్ మండలం కొత్తకోట గ్రామానికి చెందిన సందెపోగు రవీంద్ర మృతిచెందారు. ఈ దుర్ఘటన కర్నూలు మండలం జి.శింగవరం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద చోటుచేసుకుంది. రవీంద్ర కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ప్రతిరోజూ ఉపాధి నిమిత్తం కర్నూలుకు వచ్చేవాడు. శుక్రవారం ఉదయం టాటా ఏస్ వాహనంలో కూలీలతోపాటు కర్నూలుకు వస్తుండగా జి.శింగవరం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద అతి వేగంతో వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. అందులో ఉన్న రవీంద్రకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108 అంబులెన్స్‌లో కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అదే వాహనంలో ఉన్న మరో 19 మంది కూలీలకు కూడా గాయాలు కాగా, వారందరికీ ఆసుపత్రిలో వైద్యచికిత్సలు చేసి పంపారు. తోటి కూలీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కర్నూలు అర్బన్ తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మత్తుకు దూరంగా ఉండి ఓటు వేయండి



ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న డీఆర్వో మధుసూదన్‌రావు

కర్నూలు(సెంట్రల్): మే 13వ తేదీన జిల్లా ప్రజలు మత్తుకు దూరంగా ఉండి ఓటు వేయాలని డీఆర్వో కె.మధుసూదన్‌రావు కోరారు. శుక్రవారం తన కార్యాలయంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ప్రజలు మత్తుకు దూరంగా ఉండి ఓటు వేయాలని కోరుతూ రూపొందించిన ఫ్లెక్సీలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ..ఈ ఫ్లెక్సీలను అన్ని పట్టణాల్లో ప్రముఖ కూడళ్లలో ప్రదర్శించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్ అధికారి సుధీర్‌బాబు పాల్గొన్నారు.

చిరుత దాడిలో మేక మృతి

కోసిగి: మండల పరిధిలోని నేలకోసిగి గ్రామంలో చిరుత దాడిలో మేక మృతిచెందింది. బాధితుడి వివరాల మేరకు.. గ్రామానికి చెందిన భీమన్న గౌడ వీరన్న నేలకోసిగి గ్రామ శివారులోని కొండ సమీపంలో మేకలు, గొర్రెల మందను ఉంచాడు. శుక్రవారం రాత్రి చిరుత మందలోని ఓ మేకను లాక్కెళ్లింది. అక్కడున్న వారు కేకలు వేయడంతో చిరుత పరుగులు తీసింది. ఉదయం వెళ్లి కొండ పరిసరాల్లో పరిశీలించగా సగం తినేసిన మేక కళేబరం కనిపించిందని తెలిపారు.

మహిళపై కత్తెరతో దాడి

ఆత్మకూరు: పట్టణంలోని నీళ్లతొట్టి వీధిలో శుక్రవారం ఇద్దరు మహిళల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. శాలుబీ అనే మహిళపై రేష్మా, హస్మా, చాంద్‌బీ అనే మహిళలు కత్తెరతో తలపై విచక్షణారహితంగా దాడి చేశారు. దీంతో శాలుబీకి తీవ్ర రక్తస్రావం కావడంతో స్థానికులు ఆత్మకూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న ఆత్మకూరు పోలీసులు ఘర్షణకు గల కారణాలపై ఆరా తీస్తున్నారు.

డీఏలు ఎగ్గొట్టింది చంద్రబాబే

- మరోసారి నమ్మితే మూల్యం చెల్లించుకోవాల్సిందే...!
- ఉమ్మడి రాష్ట్రంలో డీఏల కోసం చలో హైదరాబాద్ వెళ్తే గుర్రాలతో తొక్కించిన బాబు
- తహసీల్దారు వనజాక్షిపై చేసిన దౌర్జన్యాన్ని గుర్తు చేసుకుంటున్న ఉద్యోగులు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పెండింగ్ లేకుండా డీఏలన్నీ చెల్లింపు
- జీపీఎఫ్, సరండర్‌లీవ్‌లు, ఏపీజీఎల్‌ఐ చెల్లింపులు కూడా పూర్తి
- సచివాలయ వ్యవస్థతో ఉద్యోగులపై తగ్గిన పనిభారం

☛ 2004లో చంద్రబాబు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి బాధ్యతల నుంచి వైదొలిగే సమయానికి ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ డీఏలు సాధించుకోవడానికి చలో హైదరాబాద్ వెళ్లిన ఉద్యోగులపై చంద్రబాబు గుర్రాలతో తొక్కించారు.

☛ 2004లో ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా పాలనా బాధ్యతలు చేపట్టిన వైఎస్ రాజశేఖర్ రెడ్డి.. చంద్రబాబు హయాంలోని పెండింగ్ డీఏలు చెల్లించారు.

☛ 2019లో ముఖ్యమంత్రి బాధ్యతల నుంచి చంద్రబాబు దిగిపోయే సమయానికి మూడు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఒక్క డీఏ పెండింగ్ లేకుండా చెల్లించారు.



కర్నూలు(అగ్రికల్చర్): ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలు ఒకటి, రెండు మినహా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నీ విడుదల చేశారు. అన్ని ఆర్థిక ప్రయోజనాలు లభించడంతో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 204లో చంద్రబాబు ఇంటికో జాబు... బాబు వస్తేనే జాబు నినాదంతో అధికారంలోకి వచ్చి ఆ తర్వాత ఉద్యోగాల భర్తీ ఊసే ఎత్తలేదు. ఐదేళ్లలో కేవలం 32 వేల ఉద్యోగాలు మాత్రమే ఇచ్చారు. నాడు ఉద్యోగులు పని భారంతో అల్లాడారు. ఇసుక అక్రమ తవ్వకాలను అడ్డుకోవడానికి ప్రయత్నించిన తహసీల్దారు వనజాక్షిపై నాటి టీడీపీ ఎమ్మెల్యే దాడి చేసి దౌర్జన్యం చేయడం. ఈ ఘటనలో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు సంబంధిత ఎమ్మెల్యేను వెనుకేసుకురావడం, తహసీల్దారును చీవాట్లు పెట్టడం ఎవరూ మరచి పోలేదు. పొరపాటున చంద్రబాబు మళ్లీ అధికారంలోకి వస్తే ఉద్యోగులు పగలే చుక్కలు చూడాల్సి వస్తుందనడంలో ఎటువంటి సందేహం లేదు.

ప్రభుత్వంపై ఉద్యోగులు సానుకూలత

2019లో చంద్రబాబు దిగిపోయే సమయానికి పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలతో సహా ఇప్పటి వరకు ఉన్న డీఏలు, జీపీఎఫ్, ఏపీజీఎల్‌ఐ చెల్లించడంతో ఉద్యోగుల పట్ల ఈ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి స్పష్టమవుతోంది. 2023 వరకు సరండర్ లీవ్‌లు కూడా మంజూరు చేసింది. దాదాపు అన్ని చెల్లింపులు పూర్తి కావడంతో ఉద్యోగులు ప్రభుత్వం పట్ల సానుకూల దృక్పథంతో ఉన్నట్లు తెలుస్తోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సీపీఎస్ రద్దు చేయకపోయినప్పటికీ ఉద్యోగుల ప్రయోజనాలు దెబ్బతినకుండా ఆ స్థానంలో జీపీఎస్‌కు రూపకల్పన చేసింది. వేతనాల చెల్లింపుల్లో కొద్ది రోజులు జాప్యం జరిగినా అన్నిరకాల ప్రయోజనాలు ఇవ్వడం మరచిపోరాదనే అభిప్రాయం ఉద్యోగుల్లో వ్యక్తమవుతోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు అమలు చేయడం వల్ల వేతనాలు చెల్లించడం కాస్త జాప్యం జరిగినా దానిని సీరియస్‌గా తీసుకోరాదని పలువురు పేర్కొంటున్నారు. చంద్రబాబు 14 ఏళ్ల పాలనలో ఉద్యోగుల పట్ల ఎలా వ్యవహరించారు, డీఏలు ఇవ్వడంలో ఎన్ని ఇబ్బందులు పెట్టారు, ఉద్యోగులపై దౌర్జన్యాలు ఇలా ఒక్కొక్కటిగా గుర్తు చేసుకుంటున్నారు.

పెన్షనర్లపై చంద్రబాబు చిన్నచూపు

చంద్రబాబు తన హయాంలో పెన్షనర్లను చిన్నచూపు చూశారు. పెన్షనర్లకు డీఏలెందుకు... అంటూ వారికి డీఏలు ఎగ్గొట్టిన ఘనత ఆయనదే. కాగా చంద్రబాబు పాలనలో అవమాన పడిన కొందరు పెన్షనర్లు ప్రస్తుతం ఆయనకు వత్తాసు పలుకుతుండటాన్ని పలువురు తప్పుబడుతున్నారు. టీడీపీ కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి టీజీ భరత్‌ను గెలిపించే విధంగా కొందరు పెన్షనర్లు ప్రయత్నిస్తుండటం విమర్శలకు తావిస్తోంది.

జగన్ పాలనలో తగ్గిన పని భారం

సచివాలయాల వ్యవస్థను ఏర్పాటు చేయడం వల్ల యువతకు ఉద్యోగాలు లభించాయి. గ్రామ, వార్డు సచివాలయాలు ఏర్పాటు చేసి లక్షన్నరకుపైగా ఉద్యోగాలు కల్పించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే. మిగిలిన శాఖల్లో మరో లక్ష వరకు ఉద్యోగాలు లభించాయి. సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో అధికారులపై పని ఒత్తిడి లేకుండా, అవినీతికి తావు లేకుండా నవరత్నాల పేరుతో అనేక సంక్షేమ పథకాలు అమలు అమలు చేయడం సాధ్యమైంది.

నాలుగైదు రోజులు జాప్యం జరిగేతే నష్టమేమి



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతోంది. ఇందువల్ల పెన్షనర్లకు పెన్షన్ ఇవ్వడంలో కొద్దిగా జాప్యం జరుగుతోంది. నాలుగైదు రోజులు జాప్యం కావడం వల్ల నష్టపోయేది ఏమీ లేదు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలకు మా వంతుగా సహకరిస్తాం. పెన్షన్ ఆలస్యం అవుతుందనే కారణంతో ప్రభుత్వంపై మాకు ఎలాంటి కోపం, ద్వేషం లేవు. ఈ ఎన్నికలు చాలా ముఖ్యమైనవి. ప్రతిఒక్కరూ విజ్ఞతతో ఆలోచించి ఓటు వేయాల్సిన అవసరం ఉంది.

– రంగారెడ్డి, కర్నూలు పెన్షనర్ల సంఘం

ఉద్యోగుల పట్ల జగన్ స్నేహభావం



చంద్రబాబుతో పోలిస్తే జగన్ ఉద్యోగుల పట్ల స్నేహభావంతో ఉంటారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కనీవినీ ఎరుగని రీతిలో సంక్షేమ పథకాలు అమలు చేశారు. ఎన్నో కుటుంబాలు సంక్షేమ పథకాలను వినియోగించుకొని పేదరికం నుంచి బయటపడ్డాయి. సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా పాలన ప్రజల వద్దకే వచ్చింది. ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నపుడు వేతనాలు, పెన్షన్ చెల్లింపులో కొందరికి జాప్యం జరగవచ్చు. దీనిని పట్టించుకోవాల్సిన అవసరం లేదు.

– జి.రాముడు, విశ్రాంత ఉద్యోగి

కష్టకాలంలో కూడా పెన్షన్ ఇచ్చారు



పెన్షన్, వేతనాల చెల్లింపుల్లో కొంతమందికి నాలుగైదు రోజులు ఆలస్యమైనంత మాత్రానా ద్వేషం పెంచుకోవాల్సిన అవసరం లేదు. మాకు ప్రతి నెలా మొదటి వారంలోనే పెన్షన్ వస్తుంది. ఏప్రిల్ నెల పెన్షన్ మే ఒకటవ తేదీనే పడింది. కరోనా వంటి కష్టమైన పరిస్థితుల్లో ఇటు సంక్షేమం, ఉద్యోగులకు, పెన్షనర్లకు వేతనాలు, పెన్షన్ సకాలంలోనే ఇచ్చారు. కష్టకాలంలో అందరికీ ప్రభుత్వం అండగా నిలిచింది.

– శివరామిరెడ్డి, విశ్రాంత ఉద్యోగి

వైఎస్సార్‌సీపీతోనే కురుబలకు న్యాయం



కురుబలతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు సత్యనారాయణమ్మ దంపతులు

వెల్దుర్తి(కృష్ణగిరి): వైఎస్సార్‌సీపీ పాలనలోనే కురుబలకు సముచిత స్థానం కల్పిస్తున్నారని, మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేసుకుంటే మరింత మేలు జరుగుతుందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు సిట్రా సత్యనారాయణమ్మ, రామకృష్ణ దంపతులు అన్నారు. శుక్రవారం వెల్దుర్తి మండలంలో ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కంగాటి శ్రీదేవితో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. అనంతరం గుంటుపల్లెలో కురుబ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మాదాసి, మాదారి కురుబలకు సముచిత స్థానం కల్పించిన పార్టీ వైఎస్సార్‌సీపీ అన్నారు. టీడీపీ కురుబలను రాజకీయంగా ఉపయోగించుకుని వదిలేస్తోందన్నారు. గతంలో టీడీపీ మేయర్‌గా పనిచేసిన కురుబ నాయకుడికి ఈ దఫా ఆర్థికంగా బలంగా లేనందునే ఆ పార్టీ సీటు కేటాయించకుండా అన్యాయం చేసిందన్నారు. ప్రస్తుత టీడీపీ కర్నూలు ఎంపీ అభ్యర్థి నాగరాజును సైతం ఆర్థికంగా దివాలా తీసే ప్రయత్నం చేస్తోందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మాదాసి, మాదారి కురుబలుగా తమ రిజర్వేషన్ సాధించుకుంటామన్న నమ్మకం బలంగా ఉందన్నారు. జిల్లాలోని కురుబలందరూ వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి బీవై రామయ్యను, జిల్లాలోని ఎమ్మెల్యే అభ్యర్థులందరిని గెలిపించుకునేలా కృషి చేయాలని కోరారు. పార్టీ నాయకుడు కంగాటి రామ్మోహన్ రెడ్డి, చెరుకులపాడు ఉన్నారు.

విద్యుత్ శాఖ స్టోర్‌లో మంటలు

- అధిక ఉష్ణోగ్రతలే కారణం
- రూ.16 లక్షల విలువైన కేబుల్, ఇన్సులేటర్లు దగ్ధం
- ఘటనపై చీఫ్ జనరల్ మేనేజర్ వెంకటాచలపతి విచారణ



ప్రమాద ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీజీఎం వెంకటాచలపతి

కర్నూలు(అగ్రికల్చర్): స్థానిక విద్యుత్ భవన్‌లో ఉన్న స్టోర్‌లోని అండర్ గ్రౌండ్‌లో వేసిన కేబుల్ బయటికి వచ్చే ప్రదేశంలో నిప్పు రవ్వలు చెలరేగాయి. ఇందువల్ల మంటలు లేచి కేబుల్, ఇన్సులేటర్లు కాలిపోయాయి. ప్రమాదం వల్ల విద్యుత్ శాఖకు రూ.16 లక్షల వరకు నష్టం వాటిల్లింది. ఒక వైపు ధర్మపేట వద్ద అండర్ గ్రౌండ్‌లో వేసిన కేబుల్ కాలిపోయింది. మరోవైపు విద్యుత్ శాఖ స్టోర్‌లో ప్రమాదం సంభవించింది. కర్నూలులో 45 నుంచి 46 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వేడిగాలుల తీవ్రత వల్ల అండర్‌గ్రౌండ్‌లో శాశ్విత ప్రాతిపదికన కేబుల్ వేశారు. వేడి భూమిలోకి వెలుతుండటం వల్ల ప్రమాదం సంభవిస్తోంది. విద్యుత్ శాఖ స్టోర్‌లో ఫైర్ యాక్సిడెంట్ చోటుచేసుకోవడంపై శుక్రవారం ఏపీఎస్‌పీడీసీఎస్ చీఫ్ జనరల్ మేనేజర్ వెంకటాచలపతి విచారణ జరిపారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై ఆయన ఎస్‌ఈ ఉమాపతి, డీఈలు, ఏడీఈలతో విచారణ జరిపారు. కేబుల్ అండర్‌గ్రౌండ్‌లో కాకుండా పైనే వేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని స్థానిక అధికారులకు సూచించారు. ఇందుకు సంబంధించి ఎస్టిమేట్లు వేయాలని సూచించారు.

భార్యపై గొడ్డలితో దాడి



గాయపడిన మార్తమ్మ

కొత్తపల్లి: మద్యం మత్తులో గొడవపడి భార్యపై భర్త గొడ్డలితో దాడి చేసిన సంఘటన శుక్రవారం కొత్తపల్లి మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. శివపురం గ్రామానికి చెందిన వడ్డెమాన్ అర్జున్ అదే గ్రామానికి చెందిన మార్తమ్మను 10 ఏళ్ల క్రితం పెళ్లి చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మద్యానికి బానిసైన అర్జున్ తరచూ తాగొచ్చి భార్యతో గొడవ పడేవాడు. భరించలేని మార్తమ్మ పుట్టింటికి వెళ్లింది. అయినా అర్జున్ ప్రవర్తనలో మార్పు రాలేదు. శుక్రవారం మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వాలని భార్యను వేధించాడు. ఆమె నిరాకరించడంతో ఆగ్రహంతో గొడ్డలితో దాడి చేశాడు. మార్తమ్మకు తల వెనుక భాగం, కుడిచేయి, మణికట్టుపై భాగం, మోచేతిపై తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం ఇవ్వగా ఆమెను ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ విషయంపై ఎస్ఐ హరిప్రసాద్ స్పందిస్తూ.. దాడి జరిగిన విషయం నిజమేనని.. బాధితురాలి స్టేట్‌మెంట్ కోసం సిబ్బందిని కర్నూలుకు పంపించామని తెలిపారు. ఆమె ఇచ్చే సమాచారం ఆధారంగా కేసు నమోదు చేస్తామన్నారు.

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌కు ఫెసిలిటేషన్ కేంద్రాల ఏర్పాటు

- జిల్లాలో 20,365 పోస్టల్ బ్యాలెట్ ఓటర్లు

కర్నూలు(సెంట్రల్): పోస్టల్ బ్యాలెట్ వినియోగం కోసం ప్రతి నియోజకవర్గంలో ఫెసిలిటేషన్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి/కలెక్టర్ జి.సృజన శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మొత్తం 20,365 మంది పోస్టల్ బ్యాలెట్ ఓటర్లు ఉన్నారని, ఇందులో 1604 మంది అత్యవసర సేవలకు సంబంధించిన శాఖల ఉద్యోగులు, ఇతర జిల్లాలకు చెందిన ఉద్యోగులు 3281మంది, ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు 15,480 మంది ఉన్నారని పేర్కొన్నారు. వీరంతా మే 6 నుంచి 8వ తేదీల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవచ్చన్నారు. జిల్లాకు చెందిన ఓటర్లయితే వారి సొంత నియోజకవర్గంలో ఓటు వేయాల్సి ఉంటుందని, ఇతర జిల్లాల వారు నివాసం ఉంటున్న నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవచ్చని తెలిపారు.

పోస్టల్ బ్యాలెట్ ఎలా వినియోగించుకోవాలంటే

- 13ఏ డిక్లరేషన్‌లో బ్యాలెట్ పేపర్ సీరియల్ నంబర్ నమోదు చేయాలి
- డిక్లరేషన్‌లో ఓటరు తప్పకుండా సంతకం చేయాలి
- డిక్లరేషన్‌పై అటెస్టేషన్ తప్పనిసరిగా ఉండాలి
- పోస్టల్ బ్యాలెట్‌పై అభ్యర్థి పేరుకు సంబంధించి ఎంపిక చేసిన స్థలంలో టిక్ లేదా ఇంటు మార్కు గుర్తు పెట్టాలి
- పోస్టల్ బ్యాలెట్‌పై సంతకం చేయరాదు. పేరు రాయరాదు
- ఓటు నమోదు చేసిన తరువాత పోస్టల్ బ్యాలెట్‌ను 13బీ కవర్‌లో పెట్టి అతికించాలి
- 13బీ కవర్‌పైన పోస్టల్ బ్యాలెట్ సీరియల్ నంబర్‌ను తప్పనిసరిగా రాయాలి
- 13బీ కవర్‌ను డిక్లరేషన్ 13సీ కవర్‌లో పెట్టి సీలు వేసి బ్యాలెట్ బాక్స్‌లో వేయాలి

బనగానపల్లెలో పట్టపగలే చోరీ

- 15తులాల బంగారం బిస్కెట్, రూ.2.90 లక్షల నగదు అపహరణ




చెల్లాచెదురుగా పడేసిన వస్తువులు

బనగానపల్లె రూరల్: బనగానపల్లె పట్టణంలోని ఏపీసీ చైతన్య స్కూల్ సమీపంలో వ్యాపారి ఇంట్లో సుమారు రూ.2.90 లక్షల నగదు, 15 తులాల బంగారం చోరీ జరిగినట్లు ఎస్ఐ రామిరెడ్డి శుక్రవారం తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. పట్టణానికి చెందిన అన్సర్‌బాషా ఉడ్ వ్యాపారం నిర్వహిస్తున్నారు. తన కూతురు వివాహం ఉండడంతో 15 తులాల బంగారం బిస్కెట్లతో పాటు రూ.2.90 లక్షల నగదును బీరువాలో ఉంచుకున్నాడు. శుక్రవారం స్థానికంగా బంధువుల వివాహం ఉండడంతో ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులంతా వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దుండగులు ఇంటికి ఉన్న సైడ్ డోర్ పక్కలో ఉన్న కిటికీ ద్వారా తలుపులు తీసి, బీరువాలో ఉన్న బంగారం, నగదును చోరీ చేశారు. సీఐ గంటా సుబ్బారావు, ఎస్ఐ రామిరెడ్డి ఆ ఇంటిని పరిశీలించారు. నంద్యాలకు చెందిన క్లూస్ టీఎం వివరాలు సేకరించింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

టీబీ డ్యాంలో 3.5 టీఎంసీల నీరు నిల్వ

హొళగుంద: తుంగభద్ర డ్యాంలో నీరు అడుగంటి డెడ్ స్టోరేజ్‌కు చేరింది. డ్యాం నీరు లేక కళ తప్పగా ఎల్లెల్సీ బోసిపోతోంది. ఆంధ్రకు సంబంధించి కర్నూలు, కడప, అనంతపురం జిల్లాలకు సాగు, తాగునీరును అందిస్తున్న టీబీ డ్యాం నాలుగేళ్లగా జూలైకి ముందుగానే పూర్తి స్థాయిలో నిండి పలు సార్లు డ్యాం 33 గేట్లు ఎత్తి నదికి విడుదల చేసిన సంగతి తెలిసిందే. అయితే గత ఏడాది వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో డ్యాంలో నీటి నిల్వలు అడుగంటాయి. టీబీ డ్యాంలో శుక్రవారం నాటికి 1,633 అడుగులకు గాను 1,577.99 అడుగులతో 105,788 టీఎంసీలకు గాను 3,567 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉన్నాయి. ఇన్‌ఫ్లో జీరో కాగా అవుట్‌ఫ్లో రూపంలో రాయబసవన కాలువకు 120 క్యూసెక్కుల నీరును వదులుతున్నారు.

నూతన రచయితలను ప్రోత్సహించాలి



సమావేశంలో పాల్గొన్న కవులు, రచయితలు

కర్నూలు కల్చరల్: అభ్యుదయ సాహిత్యాన్ని విస్తృత పరచడానికి నూతన రచయితలను ప్రోత్సహించడంలో అరసం ప్రముఖ పాత్ర పోషించడం అభినందనీయమని ప్రముఖ కవులు జె.వి.కృష్ణయ్య, గౌరెడ్డి హరిశ్చంద్రారెడ్డి అన్నారు. అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక సలాం ఖాన్ భవన్‌లో 'ఎన్నికల భారతం' కవితా సంకలనం పుస్తకావిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రచయితలు సామాజిక దృక్పథం కలిగి ప్రజా సాహిత్యాన్ని సృష్టిస్తే సమాజానికి ప్రయోజనం చేకూరుతుందన్నారు. అంతకు ముందు ప్రముఖ కథా రచయిత డాక్టర్ ఎం.హరికిషన్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. రచయిత్రి రాణి లీలావతి పుస్తక సమీక్ష చేశారు. అరసం అధ్యక్షుడు కె.ప్రహ్లాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కవులు, రచయితలు డాక్టర్ చిన్నావుల వెంకట రాజారెడ్డి, డాక్టర్ హనుమంతప్ప, అజీజ్, పుల్లా రామాంజనేయులు, మల్లికార్జున, హసీనాబీ, సయ్యద్ జహీర్, తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాద వృత్తికి ప్రోత్సాహం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల(వ్యవసాయం): న్యాయవాద వృత్తికి ప్రోత్సాహకంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం లా నేస్తం పథకం అమలు చేయడంతో యువ న్యాయవాదులకు ఎంతో ఉపయోగపడిందని ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఉదయానంద హోటల్‌లో వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ ఆధ్వర్యంలో న్యాయవాదుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైవారు మాట్లాడారు. గత ప్రభుత్వాలు న్యాయవాదులకు ఎన్నో హామీలు ఇచ్చి విస్మరించాయని, జగనన్న మాత్రం న్యాయవాదుల సంక్షేమానికి రూ.100కోట్లు కేటాయించడమే కాకుండా మృతి చెందిన వారికి బీమా కింద రూ.8లక్షలు మంజూరు చేస్తుండటంతో పేద న్యాయవాద కుటుంబాలకు భరోసా దక్కిందన్నారు. అనంతరం సీనియర్, జూనియర్ న్యాయవాదులను వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించారు. ఈనెల 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తమను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. పార్టీ రాష్ట్ర లీగల్ రాష్ట్ర కార్యదర్శి పెద్ది శ్రీనివాసులు, విజయశేఖర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, శ్రీనివాసరెడ్డి, రామసుబ్బయ్య, ప్రతాపరెడ్డి, కల్లూరు రామలింగారెడ్డి పాల్గొన్నారు.

ధాన్యం రైతుకు దన్నుగా..!



కోవెలకుంట్ల వద్ద ఆరబోసిన వడ్లు

- క్వింటాకు రూ. 2,203 ధర
- జిల్లాలో రబీలో 32 వేల ఎకరాల్లో వరిసాగు
- సాగునీటి వనరులతో గట్టెక్కిన రైతు
- ఎకరాకు 30-32 బస్తాల దిగుబడులు
- ముమ్మరంగా కోత, నూర్పిడి పనులు
- అన్నదాతకు అండగా నిలిచిన రాష్ట్ర ప్రభుత్వం

కోవెలకుంట్ల: ఖరీఫ్‌లో వరి సాగుతో లాభాలు గడించిన రైతులకు రబీ కూడా కలిసొచ్చింది. సీజన్‌లో సకాలంలో వర్షాలు కురియకపోయినా అందుబాటులో ఉన్న సాగునీటి వనరులు అన్నదాతను గట్టెక్కించాయి. పైరు వివిధ దశల్లో సాగునీరు పుష్కలంగా అందటంతో ఆశించిన స్థాయిలో దిగుబడులు రావడం, మార్కెట్‌లో ధాన్యానికి మద్దతు ధర ఉండటంతో రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. నంద్యాల జిల్లాలోని 29 మండలాల పరిధిలో బోర్లు, బావులు, చెరువులు, కుందూనది, పాలేరు, కుందరవాగు,తదితర సాగునీటి వనరుల ఆధారంగా 32 వేల ఎకరాల్లో కర్నూలుసోనా, 555 రకాలకు చెందిన వరిని రైతులు సాగు చేశారు. ఇందులో స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లోని అవుకు మండలంలో 2,475 ఎకరాలు, ఉయ్యాలవాడ మండలంలో 630 ఎకరాలు, కోవెలకుంట్ల మండలంలో 450 ఎకరాలు, దొర్నిపాడు మండలంలో 121 ఎకరాలు, సంజామల మండలంలో 70 ఎకరాల్లో సాగైంది. ప్రస్తుతం వరిపంట చేతికందటంతో కోత నూర్పిడి పనుల్లో రైతుల్లో నిమగ్నమయ్యారు.

ఊరిస్తున్న మద్దతు ధర..

ఈ ఏడాది కోటి ఆశలతో వరి సాగు చేయగా సాగునీటి వనరులు రైతులను గట్టెక్కించాయి. వరి నారు, నాట్లు, రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు, కలుపు, కోత, నూర్పిడి, తదతర పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ. 20 వేలు వెచ్చించారు. పైరు వివిధ దశల్లో దోమ, ఎర్ర తెగులు ఆశించగా రైతులు సకాలంలో గుర్తించి క్రిమి సంహారక మందుల పిచికారితో తెగుళ్లు అదుపులోకి వచ్చాయి. వాతావరణం అనుకూలంగా మారి పంట పండి ఎకరాకు 30 నుంచి 32 బస్తాల దిగుబడులు వస్తున్నాయి. వరిసాగుకు ముందే ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించింది. గ్రేడ్-1 రకం క్వింటా 2,203, గ్రేడ్-2 రకం రూ. 2,183 ధర నిర్ణయించారు. వరికి మద్దతు ధర ఉండటంతో రైతులు ఊరట చెందుతున్నారు. జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో వరిపైరు చేతికందటంతో రైతులు కోత, నూర్పిడి పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. కంబైండ్ హార్వెస్టర్ యంత్రాలతో వరి కోత. నూర్పిడి పనులు జరుగుతున్నాయి. ఎకరా వరి కోత, నూర్పిడికి రూ. 3వేలు ఖర్చు అవుతోంది. మార్కెట్‌లో ధర ఉండటంతో నూర్పిడి చేసిన వెంటనే వడ్లను విక్రయిస్తున్నారు. పచ్చివడ్లను బస్తా రూ. 1,500లకు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. దిగుబడులు ఆశాజనకంగా వస్తుండటం, ఆశించిన స్థాయిలో గిట్టుబాటు ధర ఉండటంతో ఆదాయం చేకూరుతుందని రైతులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

మూడు ఎకరాల్లో వరి సాగు



మూడు ఎకరాలల్లో వరి సాగు చేశాను. రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు, తదితర పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ. 22 వేల వరకు వెచ్చించాను. సాగునీరు పుష్కలంగా అందటంతో పైరు చేతికందింది. త్వరలో వరి కోత, నూర్పిడి పనులు చేపట్టాల్సి ఉంది. ఎకరాకు 30 నుంచి 32 బస్తాల దిగుబడులు వస్తాయని భావిస్తున్నాను. – సంజీవరెడ్డి, రైతు, కంపమల్ల, కోవెలకుంట్ల మండలం

ధర ఆశాజనకం



గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది రబీ సీజన్‌లో వరి దిగుబడులు తగ్గాయి. వర్షాలు కురియకపోవడంతో సాగునీటి వనరుల ఆధారంగా పంట చేతికందింది. మార్కెట్‌లో క్వింటా రూ. 2, 203 ధర ఉండటంతో పెట్టుబడులు పోనూ ఆదాయం వస్తుంది. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి దిగుబడులు విక్రయిస్తే దళారుల బెడద ఉండదు. – కుశాయప్ప, రైతు, అమదాల, కోవెలకుంట్ల మండలం